# లోకమాయ

డాక్టర్: పోతినేని వసుంధరాదేవి



**పనిపుత్రాణ్ణి చూడగానే ఎగిరి గంతేసినంత పనిచేసింది భానుమతి. వాడి అందం, కనుముక్కు తీరు చురుకైన కళ్ళు—చాకులా వున్నాడు.**

పనివాళ్ళకు అందం ఏమిటి అనుకునేది. వాళ్ళంటే అదో వర్గం అనుకునేది భానుమతి. తండ్రి విడిచిపెట్టి వెళ్ళగానే రాంబాబు ఎంత చురుగ్గా కనిపించాడో, అంత చురుగ్గానూ పనిలో జొరబడిపోయాడు కొత్త లేకుండా.

ముఖ్యంగా వాడు భానుమతిని ఆకర్షించడంలో కారణం- వాడి వయసే తన కొడుకు సుధీర్‌ది కూడా.

లేడీస్ క్లబ్ సెక్రటరీ భానుమతి. సెక్రటరీ అయిన తరవాతనే శ్యాంప్రసాద్ భార్య అయ్యింది. రెండూ కలసి సొసైటీలో ఆమెకు పెద్ద పేరు తెచ్చిపెట్టాయి. సేవాకార్యక్రమాలన్నిటికి ముందు భానుమతి వుంటుంది. ఆ తరువాత మిగతా వాళ్ళుంటారు. దిక్కులేని పిల్లలకు దగ్గరుండి సేవ చేస్తుంది. అంతటి కరుణామయి భానుమతి తోటివారి దృష్టిలో.

క్లబ్బులో ఫంక్షనుంది. హడావిడిగా తయారవుతూ మధ్యలో కూతురు అనితకు ఫైనల్ టచెస్ ఇస్తోంది అలంకరణలో. ఆ రోజు స్టేజిమీద 'భామాకలాపం' ప్రదర్శించబోతోంది ఆ పిల్ల. అనిత సుధీర్ కంటే రెండు సంవత్సరాలు చిన్నది. ఆటలనుంచి తిరిగొచ్చిన సుధీర్ వాళ్ళిద్దరూ రెడీ అవడం చూసి తానూ వస్తానని పేచీకి దిగాడు. అంతే వాడి నెత్తిమీద మొట్టికాయ పడింది టపీమని. "గుడ్డి వెధవ. వెధవ ఆటలకి పోవద్దంటే మానడు! వెంటవస్తాడంట. ఎన్నిసార్లుచెప్పినా బుద్ధిలేదు" వాడి బుగ్గలు రెండూ సాగదీసి పెట్టింది భానుమతి. తలమంటతో అదిరిపోవడంతో వాడి ఏడుపు తారాస్థాయినందుకొంది.

వాడి ఏడుపుతో మనసు కరగవలసిందిపోయి మరీ రాయిలా అయిపోయింది భానుమతి. తన నెత్తినే ఆ దెబ్బపడినట్లు అనిత కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్. అన్నను తమతో బయటకు తీసికెళ్ళాలని వుంటుంది ఆ పిల్లకి ఎప్పుడూ. వాణ్ణి తీసికెళ్ళడం తల్లికిష్టం వుండదు. కట్టుకొన్న గులాబిరంగు పట్టు చీర మీదకు గొంగళి పురుగు పాకుతూంటె ఎలా వుంటుందో వాణ్ణి తమతో తీసికెళ్ళాలంటే అంత ఎలర్జీగా వుంటుంది భానుమతికి. అనితకి తల్లి మీద కోపం వచ్చింది. కాటుక చెరిగిపోకుండా మెల్లిగా కళ్ళు ఒత్తుకుంది కర్చీఫ్‌తో. 'ఇప్పుడు మీటింగ్‌లో పేద పిల్లల్తో నవ్వుతూ, బహుమతులు పంచిపెడుతూ ఫొటోలు తీయించుకొంటుంది ఈ అమ్మ. ఆ మాత్రం దయ సుధీర్ మీద లేదు.'

అన్నంటే జాలి. అమ్మంటే కసి కలిగింది అనితకి. "చాలమంది పిల్లలు వస్తారుగా. అన్నను కూడా తీసికెళ్దాం మమ్మీ"- భయం భయంగా అడిగింది అనిత. "నోరు మూసుకో! వాడికేం తక్కువ చెయ్యడం లేదులే. మా ప్రాణాలు తోడ్డానికి, పరువు గంగలో కలపడానికేగా వాడు పుట్టింది. వాడి గురించి తలెత్తుకు తిరగలేకపోతున్నాను. వెధవ సంతానం. వెధవ సంతానం" అటు ఇటు తిరుగుతూ గొణుక్కుంటోంది భానుమతి. గదిలో మంచంమీద బోర్లా పడుకొని వెక్కిళ్ళు పెడ్తున్న సుధీర్. వస్తున్న వెక్కిళ్ళను బలవంతాన అదిమి పెడుతూ తల్లి తిడుతున్న తిట్లన్నీ వివరంగా వింటున్నాడు. ఇప్పుడే కాదు,అప్పుడప్పుడు ఈమాదిరిగానే సమ్మెట పోట్లు తింటూనే వుంది వాడి పన్నెండేండ్ల లేతమనస్సు. తరచూ వాడికి అనుమానంవస్తుంటుంది. 'ఈ అమ్మ స్వంత అమ్మేనా? అనితని ముద్దు చేస్తుంది. తనని తిడుతుంది, కొడుతుంది. అమ్మ, నాన్న, అనిత అందరూ అందంగా వుంటారు. వికారంగా పుట్టడం తనతప్పా? అప్పుడప్పుడూ మీటింగ్సు ఇంట్లో కూడ జరుగుతుంటాయ్. అప్పుడు తనను ఇంట్లో నుంచి బయటకు రానివ్వదు.....

'వాళ్ళంతా తలోమాట అని హేళనగా చూస్తారు ఏమిటేమిటో గుసగుసలు పోతూ చెవులు కొరుక్కుంటుంటారు. ఆడవాళ్ళంతా అమ్మ వంక, తనవంక కూడా జాలిగా చూస్తారు. అమ్మకి వాళ్ళలా చూడటం ఇష్టం వుండదు. అందుకే తనని గదిలో నుంచి బయటికి రానివ్వదు వాళ్ళున్నంత సేపు.....

'ఒకసారి తనని, అనితని బేబీషో జరుగుతోంటె తీసికెళ్ళింది. అదే మొదటిసారి. ఆఖరిసారి కూడా. అందంగా ముస్తాబుచేసిన రబ్బరు బంతుల్లాంటి పిల్లలు ఆడుకొంటున్నారు. తనని చూడగానే ఒక వింత మృగాన్ని చూసినట్లు చుట్టూ చేరి తప్పట్లు కొడుతూ "సుధీర్ ఫస్టుప్రైజు-బేబీ షో ప్రైజు సుధీర్‌కే" అంటూ నానా గొడవ చేసి పెట్టారు. ఇంటికొచ్చి బుగ్గలు సాగదీసిపెట్టి బాగా తిట్టింది అమ్మ. తన తప్పు ఏమిటో అర్థం కాలేదు...అమ్మ పొట్టలో వున్నప్పుడు ఏం సుఖంగా వుందో తనకి. స్కూల్లో కూడా కోతిముఖం, గుడ్డి ముఖం అని ఏడిపిస్తారు. అద్దాలు తీసి దాచేసి కనుక్కో చూద్దాం అని దాగుడు మూతలాడిస్తారు. ఈ గుడ్డితనం, ఈ వికృత రూపం తనకెలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది? ఒక్కసారి దేవుడు కనిపిస్తే అన్నీ అడిగెయ్యొచ్చు. తనేమీ తప్పు చెయ్యలేదుగా దేవుడు కళ్ళు పోగొట్టడానికి...'ఆలోచిస్తూ వెక్కిళ్ళమధ్య అట్లాగే నిద్రపోయాడు.... పన్నెండేళ్ళ పసివాడు.

నిర్మల దగ్గర్నుంచి వచ్చిన లెటరు చదువుతోంది భానుమతి. 6 సంవత్సరాలయింది స్టేట్స్‌కి వెళ్ళి. "భానూ మీ వూరి స్టేషను మీదుగా అమ్మగారింటికి వెళ్తున్నాను. ఈసారి మీ ఇంటికి రాలేకపోతున్నాను. పిల్లల్నిద్దరిని తీసుకొని స్టేషనుకిరా. ఆంటీ మీ కోసం చాల బహుమతులు తెస్తోందని చెప్పు పిల్లలకు" ఉత్తరం సారాంశం అంతా ఇదే.


భానుమతి గుండె బరువుగా అనిపించింది.'సుధీర్‌ని చూడగానే ఆ ఆకారం, కురూపితనం ఎందువల్ల వస్తుందో డాక్టరైన నిర్మల ఇట్టే పసిగట్టేస్తుంది. ఎన్నో రోగాలు గుప్తంగా ఒంట్లో ఇముడ్చుకొని పైకి సంఘంలో గౌరవంగా తిరగొచ్చు. ఒంటి ఆరోగ్యం సరికాకున్నా, నవ్వు ముఖంతో మేడిపండులా,విలాసంగా బట్టలు వేసుకోవచ్చు. కాని చేసిన పాపపు పనులు ఒంట్లో రక్తంగా ప్రవహిస్తూ బిడ్డల




రూపంలో బహిర్గతమయితే ఏం చెయ్యాలి? ఆ నాగరికతను ఏ పేరుపెట్టి పిలవాలి. బిడ్డల్ని గుప్తంగా ఎంతకాలం వుంచగలుగుతాం....'ఆలోచిస్తూ అలాగే సోఫాలో వాలిపోయింది భానుమతి.'శ్యాంతో పెళ్ళి అయిన ఆరు నెలలకే తనకు నెలతప్పింది. మూడు మాసాలకే ఎబార్షన్ అయిపోయింది. రక్తపరీక్షల్లో ఇద్దరికీ వెనీరియల్ డిసీజెస్ చాల డీప్‌గా వున్నాయన్నారు డాక్టరు. రెండవ దఫా కూడా 4-5 మాసాలకే గర్భం విచ్ఛిన్నం అయిపోయింది. గుప్తమైనసుఖ వ్యాధికి గుప్తంగానే వైద్యం జరుగుతోంది ఇద్దరికీ. శ్యాంకి ఎవరో ఇద్దరు, ముగ్గురు ఫామిలీ లేడీస్‌తో పరిచయం వున్నట్టు తనకు తెలుసు. ఇంటికే తీసికొచ్చినా తను అభ్యంతరపెట్టేది కాదు. కాని అతనిలో బజారు రోగాలు ఇంత బలంగా వున్నాయి అనుకోలేదు. తన బ్లడ్ రిపోర్టు రాగానే ఎన్నో మాటలన్నాడు తనని! తనూ వూరుకోలేదు. ఒకరినొకరు ఎవరేమనుకుంటున్నారో కూడా తెలీకుండా పూనకం పట్టినటు అరుచుకొన్నారు. నీ తిరుగుడే కారణం అంటే, నీ తిరుగుడే కారణం అని అరుచుకొన్నారు....'కొన్నాళ్ళకి ఈ విషయాన్ని కావాలనే మరచిపోయారు ఇద్దరూ.ఎందుకంటే తిరుగుడు ఇద్దరికీ అవసరం కాబట్టి. మూడవసారి నెలలు నిండకుండానే డెలివరీ అయింది. కొడుకుని చూసుకొన్నాక గాని చేసిన తప్పేమిటో తెలిసిరాలేదు ఇద్దరికీ. బిడ్డని చూడగానే కెవ్వుమని అరిచింది భానుమతి.'ముందుకు పొడుచుకొచ్చిన పెద్ద నుదురు. ముఖానికి మూడు రెట్లు ఉన్న తల. గుంట కళ్ళు చప్పిడి ముక్కు. ముందుకు తోసుకొచ్చిన బండపెదాలు, నల్లటి దేహం దేవుడు చాల కసిగా వుండి ఈ బొమ్మని తయారు చేశాడేమో అనిపిస్తుంది. రాను రాను మనుష్యుల్ని ఆనవాలు పట్టలేక పోతే అప్పుడు తెలిసింది వాడికి దృష్టిలోపం కూడ వుందని. నాలుగుసంవత్సరాలకే సోడాబుడ్డి కళ్ళద్దాలు,గొగ్గిపళ్ళు చూడ్డానికి వికృతంగా, భయంకరంగా వుండేవాడు. అప్పటినుంచే ఇంట్లోకి ఎవరైనా వస్తే గభాల్న దాచేసేది వాడిని. వాడ్నిచూసి ఎవరైనా కామెంట్ చేస్తుంటే భరించలేకపోయేది. శ్యాంగాని, తానుగానివాణ్ణెప్పుడూ ముద్దుగాదగ్గరికి తియ్యలేదు. వాణ్ని చూడగానే ఇద్దరికీ గిల్టీఫీలింగ్. డాక్టర్లు ఎంత చెప్పినా తను వైద్యం రెగ్యులర్‌గా తీసికోని మాట వాస్తవమే. తనకు టయిమే కుదిరేది కాదు రెగ్యులర్ చెకప్‌కి. డాక్టరు దగ్గరకి తీసుకెళితే "చూపు అంతకంటే ఎక్కువ రాదు. తల్లిదండ్రుల అజాగ్రత్త

వల్లపసివాడు అన్యాయంగా బలయిపోయాడు అన్నారు. డాక్టరుగారి మాటలకు ఇద్దరు తలలు వంచేసుకున్నారు. ఆ తర్వాత రెండేళ్ళకి అనిత విషయంలో జాగ్రత్తపడ్డారు. ఈ బాధలు పళ్ళేక తరువాత తనే ఆపరేషను చేయించుకొంది. తాము చేసిన తప్పులకి వాడెంతవరకు బాధ్యుడు? పైగా వాడి జీవితాన్ని ఒకప్పుడు తెలీకుండా నాశనం జేశారు. కురూపిగా గ్రుడ్డివాడిగా జన్మనిచ్చి ఈ లోకంలో వదిలిపెట్టారు....

"ఇప్పుడు తెలిసి చిత్రహింస పెడ్తున్నారు- నేరంలేని శిక్ష అనుభవిస్తున్నాడు. తల్లిగా ఇంత ఆలోచించినా వాడి ఉనికే భరించలేకపోతోంది. తమని. తమ తప్పుల్ని యాగీ చెయ్యడానికే వాడు పుట్టాడనిపిస్తుంది. రాక రాక వస్తోంది నిర్మల. తనని. తన సంసారాన్ని ఎంతో ఉన్నతంగా ఊహించుకొంటుంది. ఆ ఇమేజ్‌ని పాడు చెయ్యాలనిపించడం లేదు. ఈ సారి పిల్లలిద్దర్నీ చూపించకపోతే వూరుకోదు. టయిం చూసుకొంది. ట్రైను రావడానికి ఇంకా గంట వ్యవధి వుంది. సోఫాలో నుంచి లేచింది. తను రెడీ అయింది. వంటింట్లో వున్న రాంబాబుని పిలిచి బరాబరా బాత్‌రూమ్‌లోకి లాక్కుపోయింది. వాడి మురికిబట్టలు లాగిపారేసి షవర్ తిప్పి షాంపుతో తల



స్నానం చేయించింది. అమ్మగారి పన్లకి తెల్లబోయినా, కిక్కురు మనకుండానే చేయించుకున్నాడు వాడా పన్లన్నీ అమితోత్సాహంతో. సుధీర్‌కోసం కుట్టించిన సూటూ, మాచింగ్ షర్టు, టై- టైపిన్నూ. షూ అన్నీ వేసి. చక్కగా తల దువ్వింది. ఆ బట్టలో వాడు దొర బిడ్డలా మెరిసిపోతున్నాడు. తన బట్టలు షూ అన్నీ వేసుకుంటున్న ఆ రాంబాబుగాణ్ణి ఆ పనివాణ్ణి ఈర్ష్యగా, కసిగా చూస్తున్నాడు ప్రక్కనే వుండి సుధీర్. పైగా అమ్మ వాడికి అన్నీ చక్కగా చేస్తోంది స్వయంగా. మీదపడి వాణ్ణి తన్నెయ్యాలనుకొన్నాడు. అందినచోటల్లా కొరికి కసి తీర్చుకోవాలనుకుంటున్నాడు. అమ్మ పనుల్ని చూసి కోపంతో ఎగసిపడ్తున్న సుధీర్‌ని. అన్న బట్టల్లో తయారయిన రాంబాబుని మార్చి మార్చి చూస్తోంది అనిత.


Join atOnce
BEST RESULT VERY LOW FEE
EFFICIENT POSTAL COACHING

**POPULAR & EFFICIENT EDUCATIONAL INSTITUTE IN THE WORLD!**

**Recognised and Affiliated with I.A.E., I.B.A.M & COM. UNIVERSITY**

1. M.B.A., M.B.M., A.M.I.B.M., D.B.A., D.B.M., L.L.B. & B.G.L. (All degree Holders are eligible)
2. MYSORE/ANDHRA B.A., B.Com. & ANDHRA MATRIC (No Previous School or College study is required)
3. OSMANIA B.A., B.Com., (One sitting) (P.U.C./INTER Passed are allowed)
4. S.V. M.A., M.Com 5. COM. UNIVERSITY: INTER, D.Com, B.Com, B.Com (Hons) & M.Com. (No previous School/College study is required)
6. A.M.I.E. (Civil/Mech/Electrical) & A.M.I. Mech. E Equalent to B.E. (S.S.L.C., S.S.C., H.S.C., P.U.C., INTER PRE-DEGREE, ENGG. DIPLOMA HOLDER, B.Sc. Passed/Failed are eligible) 7. BANK OFFICER/CLERKS
8. ACCOUNTANCY 9. ALLOPATHY 10. SERVICE COMMISSION 11. HIGHER SECONDARY.

*For full particulars please send Rs. 3/- by M.O.*

**SRI MURUGAN TUTORIALS**

GUARANTEE CERTIFICATE WILL BE ISSUED

(Estd. :21-3-1962 Govt. Regd. No.: 3072) H.O: RISHIVANDIYAM, 606 205-TAMILNADU

REGIONAL OFFICE : 41, ARCOT ROAD, KODAMBAKKAM MADRAS-600 024. PHONE: 426480

"నిన్న నాటకం జరుగుతోంటే రెండో రంగం చూడకుండానే వెళ్ళిపోయావేం?"



"రెండవ రంగం రెండు సంవత్సరాల తర్వాత జరగబోతోందన్నారు గదా! అప్పటిదాకా ఆగలేక."

పెళ్ళయిన నాలుగు నెలలకే, భార్య ప్రసవించడంతో అందుకు కారణమేమిటని డాక్టర్ని అడిగాడు రంగనాథం.

"మొదటి కాన్పు విషయంలోనే ఇలా అవుతుంది. ఆ తర్వాత ఇలా జరగదు" డాక్టర్ సమాధానం.

కె. మదన్ మోహన్ రావ్. విజయవాడ-

ఒక్క క్షణంలో కోపాన్ని ఎలా అణుచుకొన్నాడో. వయస్సు మించిన బుద్ధిని ప్రదర్శించాడు వాడు. ఆపుకోలేక గదిలోకి పరుగెత్తి మంచం మీద బోర్లాపడి మెల్లిగా ఏడుస్తూ వుండిపోయాడు.

"ఒరే రాంబాబు—ఇప్పుడు మనం రైలు స్టేషనుకు వెళ్తున్నాం. అక్కడ రైల్లో నుంచి ఒక అమ్మగారు దిగుతారు. నీకు చూపిస్తాన్లే-అమ్మగార్ని చూపించగానే అనితమ్మగారితో పాటు నువ్వు కూడా "నమస్తే ఆంటీ" అని దణ్ణం పెటాలి. ఏం క్లాసు చదువుతున్నావంటే "సిక్త్స్ క్లాస్" అని చెప్పాలి. అంతకంటె ఎక్కువ మాట్లాడకూడదు. ఆ కాసేపు నువ్వు సుధీర్ బాబులా దర్జాగా నిలబడాలి. తెలిసిందా" భానుమతి వాడవల్సినమాటల్ని నాలుగైదు సార్లు వల్లెవేయించి ట్రైనింగిచ్చింది. మంచి బట్టలు. కారు ప్రయాణం. రాంబాబు సంతోషానికి అవధుల్లేవు. స్టేషన్లో నిర్మలని చూడగానే కావలించుకొన్నంత పని చేసింది భానుమతి. పిల్లలిద్దర్ని పరిచయం చేసింది. "నీ పిల్లలు ఎంత బావున్నారు భానూ. వీడు సుధీర్ అని కదూ చెప్పావు. భలే స్మార్టుగా వున్నాడు. శ్యాంపోలికలనుకుంటా" అంటూ తను తెచ్చిన ప్రెజెంటేషన్సు వాళ్ళకివ్వటానికి సూట్ కేసులో నుంచి తీస్తోంది. ఇంతలో వాడు-రాంబాబు-సంతోషంతో అరుస్తూ పరుగెడుతున్నాడు.

"అయ్యోయ్. ఓ అయ్యా. నువ్వ ఇదే బండిలో వత్తావనుకోలేదే! ఎప్పుని కూడా తోలుకు రాపోయ్యావా- సూడు అమ్మగారు నాకు ఎంత మంచి గుడ్డలిచ్చిందో" అంటూ తన బట్టలు తండ్రికి చూపిస్తూ తండ్రి చెయ్యిపట్టుకొని వూపుతూ కులాసాగా భానుమతి వాళ్ళ దగ్గరకి లాక్కొస్తున్నాడు. నీరుకావి పంచె, అటువంటిదే తల పాగా. అతుకుల నీరుకావి చొక్కా. కుడిచేత్తో తెగిపోయిన కాలి చెప్పుల జత పట్టుకొని. నెత్తిమీద మూటతో కొడుకుని మొదట్లో పోల్చుకోలేక తర్వాత సంతోషం పట్టలేక ఆ తండ్రి రాంబాబుతో వూసులాడుతూ వస్తున్నాడు.

ఈ దృశ్యం చూసిన భానుమతి అదిరిపోయింది. ఒంట్లో రక్తం అంతా గడ్డకట్టిందో లేక ఆవిరే అయిపోయిందో తెల్లగా పాలిపోవడం మాత్రం జరిగింది. "సూడమ్మగోరు! అప్పుడనగా వదిలెల్లాడా అయ్యనన్ను నీకాడ-మల్లా ఇదే రాటం" అంటూ ఫిర్యాదు చేస్తున్నాడు యజమానురాలికి. ఇదంతా చూస్తున్న నిర్మలకి అయోమయంగావుంది. కొంచెంకొంచెంగా అర్థంకూడాఅయివుండాలి. ట్రైను కదలడానికి సిద్ధంగావుంది. నిర్మల తన కంపార్టుమెంటులోకి ఎక్కి గుమ్మంలో నిలబడి చెయ్యి వూపుతోంది. "క్షమించు నిర్మలా! వెళ్ళిన తరువాత అంతా విపులంగా లెటరు వ్రాస్తాను" అంటున్న భానుమతి మాటలు గాలిలో కలిసిపోయాయి. కారులో ఇంటికి వస్తూ అనిత అనుకొంటూంది. 'కారులో మేడల్లోతిప్పే అమ్మ మాకు వద్దు. ఎత్తుకుని గోరు ముద్దలు మింగించి ప్రక్కలో పడుకోబెట్టుకొని మంచి కథలు చెప్పే అమ్మే కావాలి' అని.

